క్లుప్తంగా

ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసి డిపో నుంచి కలికిరి, ముళబాగల్, రాయచోటి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు గురువారం బహుమతులు పంపిణీ చేశారు. డీఎం సుధాకరయ్య ఆధ్వర్యంలో ప్రయాణికులు అరుణకుమారి, దొరబాబు, విశ్వనాథ్, మునికుమారి ఆ ప్రాంతాల బస్సుల్లో ప్రయాణించిన వారికి లాటరీలలో విజేతలుగా నిలవడంతో వారికి బహుమతులు అందజేశామన్నారు. ప్రతి ఒక్కరు సురక్షిత ప్రయాణాలకు ఆర్టీసి బస్సులు వినియోగించుకోవాలని కోరారు.

ధ్రువపత్రాల పంపిణీలో జాప్యం చేస్తే చర్యలు



ఉద్యోగుల పనితీరును పరిశీలిస్తున్న చైర్మన్

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని విద్యార్థులు, ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాల పంపిణీలో జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా హెచ్చరించారు. గురువారం ఆయన పట్టణంలోని కొత్తపేట 16వ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు, సమస్యల నమోదు, సర్టిఫికెట్ల పంపిణీ తదితర విషయాలను ఫోన్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యదర్శులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

క్రీడాకారులకు సన్మానం



చౌడేపల్లె పాఠశాలలో క్రీడాకారులను సత్కరించిన హెచ్‌ఎం నాగరాజ రెడ్డి

చౌడేపల్లె: జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో తలపడిన క్రీడాకారులను బాలల దినోత్సవం సందర్భంగా గురువారం హెచ్‌ఎం నాగరాజ రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిరంజన్, శివ, కేశవ హేమావతి, సుమతి, లాస్యప్రియ, నిహారిక, అపర్ణలను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పిల్లారి ఏజెన్సీ నిర్వాహకులు జీవన్ ప్రకాష్ సహకారంతో క్రీడాకారులు, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. క్రీడాకారులను పీడీ రాజేంద్ర, ఉపాధ్యాయులు మురళి, సుధాకర్, ఈశ్వర్, రమణప్ప, పరిమళ, భారతి, ఉమాశంకర్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి అభినందించారు.

రాష్ట్రస్థాయి విజేతలకు సత్కారం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కుప్పంరూరల్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో రాణించిన చందం ఉన్నత పాఠశాల విద్యార్థులను గురువారం హెచ్‌ఎం మురళి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాజ్‌ఖాన్, రమేష్, శాంతిర్మయి, మంజునాథ్, లీలాదేవి, మాధవి, గాయత్రి, మహేష్, సురేంద్రబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు లోకనాథం పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత మృతికి సంతాపం

పెద్దపంజాణి: పలమనేరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తిప్పిరెడ్డిగారి పార్థసారథి రెడ్డి తండ్రి గోవింద రెడ్డి గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పలమనేరు మాజీ ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ పార్టీ శ్రేణులతో కలసి మృతుని స్వగ్రామమైన వలసపల్లికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగా రెడ్డి, అమరనాథ రెడ్డి, సుబ్రమణ్యం, వెంకటేష్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఖాతాదారుల అయోమయం

- హోల్డ్‌లోకి వెళ్తున్న ఖాతా డబ్బులు
- బ్యాంకర్ల పొంతలేని సమాధానాలు
- లబోదిబోమంటున్న వినియోగదారులు



కుప్పం పట్టణంలోని కమతమూరు బ్యాంకు

కుప్పం రూరల్: కుప్పం ప్రాంతంలో ఎస్‌బీఐ ఖాతాదారులకు కొత్త కష్టం వచ్చిపడింది. ఎవరో సైబర్ నేరగాళ్లో .. ఇతర హ్యాకర్ల చేతిలో మోసపోవడం ప్రస్తుత తరుణంలో పరిపాటిగా మారుతున్న విషయం తెలిసిందే. కానీ ఏకంగా బ్యాంకర్ల నుంచే లోటు పాట్లు జరిగి బ్యాంకులో అవసరాల కోసం దాచుకున్న డబ్బు హోల్డ్ పేరిట నిలిచిపోతుండడంతో కుప్పం ఎస్‌బీఐ ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

'డియర్ కస్టమర్ హోల్డ్ హ్యాజ్ బీన్ ప్లేస్డ్ ఆన్ యువర్ ఏసీసీ (అకౌంట్ నెంబరు) ఫర్ 20,000 ఫర్ ది రీజన్ సైబర్ సెల్.. ఎస్‌బీఐ' అంటూ మొదట సంక్షిప్త సందేశం వస్తుంది. తీరా బ్యాంకు ఖాతాలో వెళ్లి చెక్ చేసుకుంటే రూ.20 వేలు హోల్డ్‌లో ఉన్నట్లు చూపిస్తుంది. బ్యాంకర్ల వద్దకు వెళ్లి ఎందుకు మా నగదు హోల్డ్ చేశారని, ఆరా తీస్తే ఎస్‌బీఐ సిబ్బంది నుంచి సరైన సమాధానాలు రావడం లేదు. మా పై స్థాయిలో జరిగింది..మేము ఏమి చేయలేం... ఏదైనా ఉంటే లెటర్ రాసి ఇవ్వండి.. పైస్థాయి అధికారులకు పంపుతామంటూ.. నిస్సహాయంగా సమాధానాలు చెబుతున్నారు. దీంతో అవసరాల కోసం దాచుకున్న 20 వేల రూపాయలు ఇలా హోల్డ్ కావడంతో వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు.

భద్రత లోపం

ఇంట్లో పెట్టుకుంటే భద్రత ఉండదని, బ్యాంకులో దాచుకుంటే నగదు భద్రంగా ఉంటుందని, బావించి బ్యాంకులో నగదు పెట్టుకుంటే ఇక బ్యాంకులో కూడా రక్షణ లేదంటే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలంటూ వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు.

స్కూల్ ఫీజులకు దాచుకుంటే..


కుప్పం పట్టణానికి చెందిన ఓ గృహిణికి తమ పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించేందుకు ఎస్‌బీఐలోని తన ఖాతాలో రూ. 20 వేల దాచుకుంది. బ్యాంకులో ఉంటే సురక్షితంగా ఉంటుంది కదా.. పండుగ అవసరాలు చూసుకుని తరువాత ఫీజు చెల్లించవచ్చని అనుకుంది. తీరా గత నెల 22న సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఎస్‌బీఐ నుంచి పై సూచించిన విధంగా సంక్షిప్త సందేశం వచ్చింది. అంతే బ్యాంకు అనుసంధానం చేసిన ఫోన్ పే, గూగుల్ పే చేసినా పని చేయలేదు. ఇన్ సఫిషియంట్ ఫండ్ అని సంక్షిప్త సందేశం వచ్చింది. మరుసటి రోజు బ్యాంకర్లను సంప్రదిస్తే పైస్థాయిలో జరిగింది. మేము ఏమి చేయలేము.. లెటర్ రాసి ఇవ్వండి.. అని సమాధానాలు వస్తున్నాయే తప్ప .. వారి సమస్యకు పరిష్కారం దొరకలేదు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో వినియోగదారులు పడ్డారు. ఇలా పదుల సంఖ్యలో కుప్పం పట్టణంలో ఎస్‌బీఐ వినియోగదారులకు సమస్యలు ఎదురవుతున్నా బ్యాంకర్లు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఫిర్యాదులు మెయిల్ చేశాం..

సైబర్ సెల్ వివరాలు మా పరిధిలో ఉండవు. తమ దృష్టికి ఇలాంటి కేసులు నాలుగు వచ్చాయి. ఏరియా హెడ్ ఆఫీసు హైదరాబాదులో ఉంది. ఖాతాదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు హెడ్ ఆఫీసుకు మెయిల్ చేశాం. త్వరలో వారి నగదు రిలీజ్ అవుతుంది. ఎవరైనా ఇతరుల బ్యాంకు అకౌంట్లలో వేసి సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేస్తే ఇలా హోల్డ్ చేస్తారు. లేక బెట్టింగ్‌కు పాల్పడితే వారి ఖాతాలు ఇలాగే బ్లాక్ అవుతాయి.

–సంపూర్ణ, ఎస్‌బీఐ మేనేజర్, కమతమూరు





ఎస్‌బీఐలో ఖాతా కలిగిన గృహిణికి వచ్చిన మెసేజ్, లీన్ అమౌంట్ అంటూ హోల్డ్‌లో పడిన నగదు

ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

పలమనేరు: జాతీయ మధుమేహం దినం సందర్భంగా స్థానిక కమ్యూనిటీ పారా మెడికల్ సంఘం ఆధ్వర్యంలో గురువారం షుగర్ వ్యాధి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి 160 మంది వరకు రోగులు హాజరైనట్లు నిర్వాహకులు జనార్దన్ తెలిపారు. ఇందులో వాసు, అరుణ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలో సీపీఎం నాయకులు

పలమనేరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద స్థానిక సీపీఎం నాయకులు ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆపార్టీ నాయకులు గిరిధర్ గుప్తా మాట్లాడుతూ.. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

నేడు ప్రజా రవాణా సదస్సు

కుప్పం: ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో శుక్రవారం ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం ఆధ్వర్యంలో రవాణా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రయాణికుల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ పరంగా ఉన్న సమస్యలపై సమీక్ష జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

బడ్జెట్‌లో అన్ని రంగాలకు మోసం



గృహప్రవేశ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ పరిధిలోని తిమ్మయ్యగారిపల్లెలో గురువారం వైస్ ఎంపీపీ రూప జయకుమార్ నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరయ్యారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేతలతో ముచ్చటించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాల్లో వారిని మోసం చేసేలా ఉందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అప్పులు చేయడం సహజమని, ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగానే అప్పులు చేస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంక అవడం ఖాయమని గత ఎన్నికల్లో చంద్రబాబు చేసిన ప్రచారం ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడానికేనన్నారు. సూపర్ సిక్స్ పథకాలు వస్తాయని ఎదురుచూస్తున్న ప్రజలకు కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఆయనతో పాటు రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచులు బాలకృష్ణగౌడు, వెంకటేష్, రాజప్ప, రవిచంద్ర, దేవేంద్రరెడ్డి, రమణారెడ్డి, ఎంపీటీసీలు నాగరాజు, వినాయకం, భాస్కర్ , అభినవ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన నేతలు

చౌడేపల్లె: మదనపల్లె పట్టణంలో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి చౌడేపల్లె మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు హరిబాబు మాట్లాడుతూ.. బైక్ ర్యాలీ ద్వారా మదనపల్లెకు వెళ్లి మందకృష్ణ మాదిగకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు ఆంజప్ప, గోవిందు, మల్లికార్జున, లోకేష్, చిట్టిబాబు, రెడ్డప్ప, చిన్ని రమేష్, శంకర తదితరులున్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న అభిమానులు

వి.కోట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి గురువారం విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో అభిమానులు 34 యూనిట్ల రక్తం దానం చేసినట్లు సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మురళీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు భారీగా తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సాయినాథుని ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



పూజలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: మండలంలోని షిరిడీ సాయి ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ముందు రోజు ఉదయం నుంచి సాయినాథునికి విశేష పూజలు, హోమాలు చేపట్టగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, పార్టీ నేతలు శ్రీరాములురెడ్డి, మండీ సుధ, దయానందగౌడ, సిద్దప్ప, బాలకృష్ణ, మురళి, రమేష్‌రెడ్డి, మహేష్, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ మల్లేష్‌యాదవ్

కుప్పంరూరల్: సీనియర్ విద్యార్థులు జూనియర్, తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ×యాంటీ ర్యాగింగ్ ఫోర్స్– యాంటి నార్కొటిక్స్౯ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి అతిథిగా హాజరైన సీఐ మల్లేష్ యాదవ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ చదువులు సాగిస్తున్నారని, అలాంటి సమయంలో తోటి విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, ర్యాగింగ్‌కు పాల్పడడం మంచిది కాదన్నారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమన్నారు. క్రమశిక్షణ, గురువుల పట్ల గౌరవంగా మెలగడంతోనే ఉన్నత చదువులు సాధ్యమన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. అనంతరం ర్యాగింగ్‌కు పాల్పడమని విద్యార్థులచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సయ్యద్ హుస్సేన్ మియ్యా, అధ్యాపకులు నరసింహులు, రాధా, మణిశంకర్, ప్రవీణ్‌కుమార్, వెంకటరమణ, షణ్ముగం, శిరీష, అమరనాథ్ పాల్గొన్నారు.

108 సిబ్బందికి వేతనాలు పెంచాలి



తహసీల్దార్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న 108 సిబ్బంది

రొంపిచెర్ల: 108 అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది మాట్లాడుతూ.. వ్యవస్థలో నిర్వహణ సంస్థలను మార్చు చేసే ప్రతిసారి ఉద్యోగుల గ్రాట్యూటీ, ఎర్నడ్ లీవు అమౌంట్, వార్షిక ఇంక్రిమెంట్లు చెల్లించకుండానే వైదొలగడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చేస్తున్న 12 గంటల విధానాన్ని 8 గంటలకు కుదించాలని కోరారు. 108లో పని చేసిన సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా వెయిటేజీ ఇవ్వాలన్నారు. 108 ఉద్యోగుల సమస్యలను ఈనెల 24 లోపల పరిష్కారం చేయకపోతే 25 నుంచి సమ్మెలో వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఎంటీ నవీన్‌కుమార్, పైలట్ సలాం పాల్గొన్నారు.

చౌడేపల్లె: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఈనెల 25 నుంచి రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సమ్మెలోకి వెళ్తామంటూ తహసీల్దార్ హనుమంతునాయక్‌ను 108 సిబ్బంది గణేష్, ప్రసాద్ కలిసి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 108ను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. వేతన స్లాబ్‌లు అప్‌డేట్ చేసి వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో 108 సిబ్బందికి వెయిటేజీ ఇవ్వాలని కోరారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఈవో

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ నగిరి దళితవాడ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు పూర్వ విద్యార్థులు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు రెడ్డిప్రసన్న, హరిత, జగదీష్, సిద్దార్థ, జ్యోతిదాస్ కలసి విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, మెండర్లు, స్కేళ్లు, ప్లాస్టిక్ బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో ఇందిర మాట్లాడుతూ.. పేద విద్యార్థుల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి విద్యా సామగ్రి పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఎల్లప్ప, మదనమోహన్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

పెద్దపంజాణి: మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అభివృద్ధి ప్రణాళిక తయారీపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు.

సదుం: మండల పరిషత్, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించేందుకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ వరప్రసాద్ తెలిపారు.

గుడుపల్లె: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికపై శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాధాకృష్ణన్ తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనులను గుర్తించి ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

సదుం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ధరణీధర వైజాగ్‌లో జరిగిన అండర్–14 కబడ్డీ పోటీలలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపియ్యాడు. అతనికి పీడీ రెడ్డి ప్రవీణ రూ.2 వేలు, హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి రూ.2,500 నగదు ప్రోత్సాహక బహుమతి అందించారు. క్యాంప్‌లో పాల్గొన్న క్రీడాకారులకు పీడీ కిశోర్‌కుమార్ రూ. 5 వేలు విలువ చేసే దుస్తులు సమకూర్చినట్లు హెచ్‌ఎం తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి రూ. 9 వేలు విలువ చేసే బహుమతులు అందించారు.

పిచ్చి మొక్కల తొలగింపు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు ఉన్నత పాఠశాల ముందు పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించి శుభ్రం చేయించారు. గత నెలలో కలెక్టరు కల్లూరు హైస్కూలును సందర్శించినప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అందులో భాగంగా గురువారం జేసీబీతో పాఠశాల ముందు శుభ్రం చేయించినట్లు హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ షుకూర్, పంచాయతీ ఈఓ నాగరాజ, ఉపాధ్యాయులు వెంకట సిద్దులు, వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16న మామిడి రైతులకు శిక్షణ

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10.30 గంటలకు గంగవరం, పెద్దపంజాణి మండలాలకు చెందిన రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉద్యాన అధికారి వరప్రసాద్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా మామిడి సాగులో నూతన పద్ధతులు, పూత, పిందె సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి శాస్త్రవేత్తలు, జిల్లా అధికారులు తెలియజేస్తారని తెలిపారు. మామిడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా బాలకృష్ణ

గుడుపల్లె: ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారిగా బాలకృష్ణ గురువారం బాధ్యతలను స్వీకరించారు. కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ పదోన్నతిపై గుడుపల్లె మండల ఏవోగా నియమితులయ్యారు.

డయల్ యువర్ డీఎంకు పలు సమస్యలు



ఆర్టీసీ డీఎం టీకే స్వామి

పలమనేరు: స్థానిక ఆర్టీసీ డీఎం గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పలు సమస్యలు వచ్చినట్లు డీఎం టీకే స్వామి తెలిపారు. ఇందులో భాగంగా పలమనేరు నుంచి ఉదయం నాలుగింటికి తిరుపతికి బస్సు సర్వీసు, రాత్రి 9 గంటలకు చిత్తూరు నుంచి పలమనేరుకు పల్లె వెలుగు సర్వీసు, పలమనేరు నుంచి రాత్రి దాసార్లపల్లెకు గతంలో నడుస్తున్న సర్వీసును పునరుద్ధరించాలని సూచించారని తెలిపారు. పలమనేరు నుంచి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడపాలనే సలహాలు వచ్చాయన్నారు. ఇందులో భాగంగా పలమనేరు డిపో నుంచి కార్తీక సోమవారాల్లో భాగంగా ఈనెల 18న , 25న స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రత్యేక బస్సు మొగిలి, ముళబాగిళు ఆంజినేయస్వామి ఆలయం, కురుడుమళైలోని వినాయకుని ఆలయం, బంగారు తిరుపతిలోని వేంకటేశ్వరుని ఆలయం, కేజీఎఫ్ లోని కోటి లింగాలు ఆలయాలకు ప్రత్యేక సర్వీసును నడుపనున్నట్లు పేర్కొన్నారు.

క్యాన్సర్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి





రొంపిచెర్ల: క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న సిబ్బంది, అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

రొంపిచెర్ల: క్యాన్సర్ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరి పేర్కొన్నారు. రొంపిచెర్ల పంచాయతీలో క్యాన్సర్ పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య సిబ్బంది సుజాత, శైలజ పాల్గొన్నారు.

గంగవరం: గంగవరం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను వైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని 9 సచివాలయాల పరిధిలో 18 ఏళ్లు దాటిన దాదాపు 90 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు.

బైరెడ్డిపల్లె: క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ కేంద్రాల్లో గురువారం క్యాన్సర్ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్లు కాంతమ్మ, సావిత్రమ్మ, సీహెచ్‌ఓ అనూరాధ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



బహుమతులు అందజేస్తున్న వికాస్ మర్మత్

కుప్పం: గ్రంథాలయాలతో విద్యార్థులకు పుస్తక విజ్ఞానం పెరుగుతుందని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కుప్పం గ్రంథాలయంలో పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వి.కోట: స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

పుంగనూరు: పట్టణంలోని గ్రంథాలయంలో 57వ జాతీయ వారోత్సవాలను అధికారులు తులసీనాయక్, నసీబ్‌జాన్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు వెంకటపతి, హరిమొదలియార్, రెడ్డెప్పరెడ్డి కలసి గ్రంథాలయ ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. న్యాయవాదులు గిరిధర్, రామలింగప్ప పాల్గొన్నారు.

కుప్పం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ నారాయణమూర్తి, బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

చౌడేపల్లె: గ్రంథాలయాలు చరిత్రకు నిదర్శనాలని ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వారోత్సవాలను పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. కృష్ణారెడ్డి, రోశయ్య, గ్రంథాలయాధికారి సోమశేఖర్ పాల్గొన్నారు.

బాలల పండుగ.. ఆనందాల వేడుక





పలమనేరు: ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డా. మమతారాణి ఆధ్వర్యంలో..., వి.కోట: గెలుపొందిన విద్యార్థులతో సీఐ సోమశేఖర్‌రెడ్డి

- ఘనంగా బాలల దినోత్సవం

పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఘనంగా జరుపుకున్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పలమనేరు ఏరియా ఆస్పత్రి సూపరిండెంట్ డా. మమతారాణి ఆధ్వర్యంలో ఆస్పత్రిలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. పలమనేరు పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో మండల లీగల్ సర్వీసెస్ ద్వారా స్థానిక న్యాయవాదులు బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. లయన్స్‌సేవా కేంద్రం నిర్వాహకులు పలమనేరు పట్టణ సమీపంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు.అలాగే వి.కోట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి సీఐ సోమశేఖర్ హాజరై విద్యార్థులకు సందేశం ఇచ్చారు.

–పలమనూరు/ పుంగనూరు/ కుప్పం/గంగవరం/ పెద్దపంజాణి/వి.కోట



అడవిబూదుగూరులో నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు